# Padmavathi Srinivasula Kalyanam

'విశ్వపతి'గా పేరుగాంచిన తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి గారు రచించిన 'శ్రీ శ్రీనివాస మహత్యము' పుస్తకములోని ఒక అధ్యాయమిది. 'వ్రాసింది నేనైనా నాచే వ్రాయించింది ఆస్వామివారే... కేవలం కలం మాత్రం నేను పట్టుకున్నాను అంతే... సాక్షాత్తూ స్వామివారే ప్రతి అక్షరానికి ప్రేరణ' అన్నారు ఆయన. యుక్త వయస్సుకి వచ్చిన వారు ఈ అధ్యాయం చదివితే పెళ్ళి జరుగుతుందని ఆస్తికుల నమ్మిక.

## శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయము

త్రిమూర్తులను పరీక్షింప దలచిన భృగుమహర్షి తన నివాస స్థానమైన శ్రీ మహావిష్ణువు యొక్క హృదయ స్థానమందు తన్నుటచే మహాలక్ష్మి మిక్కిలి బాధపడి, కోపించి వైకుంఠము వీడి కరవీర పురము (కొల్హాపురము) నకు బోయెను. అటు తరువాత లక్ష్మీనాథుడు మిక్కిలి బాధ చెంది, లక్ష్మీదేవిని వెదకుచూ భూలోకమునకు చేరెను. కొండలు, గుట్టలు, వనములు ఎందెందు వెదకిననూ లక్ష్మికానరాలేదు. లక్ష్మీదేవి తోడుగా లేని శ్రీమన్నారాయణుడు మిక్కిలి బాధతో ఎటులెటులో అనేక ప్రదేశముల తిరుగుచుండెను.

తిరిగి తిరిగి అలసి పోయి గంగానదికి దక్షిణమున మూడు వందల యోజనముల దూరమున, సువర్ణముఖి కుత్తరమున క్రోసు దూరమున నున్నట్టియు మూడు యోజనములు వెడల్పును, ముప్పది యోజనముల పొడవును గలిగినట్టియు, శిరస్సునందు వేంకటగిరిని, మధ్య భాగమున నృసింహాద్రిని, చివరిన శ్రీశైలమును కలిగినట్టియు అయిన వేంకటాద్రిని చేరి అచ్చటనొక పుట్టలో వీనుడై యుండెను. లక్ష్మీదేవి కొరకు ఆ పుట్టయందే యుండి ఘోర తపస్సు చేయుచుండెను.

మహావిష్ణువు ఈ విధముగా వైకుంఠమును వీడి వచ్చుటచే వైకుంఠము కళావిహీన మయ్యెను. జరిగినదంతయూ తెలుసుకుని బ్రహ్మాది దేవతలు శ్రీమహావిష్ణువు ప్రస్తుతము వేంకటాద్రిపై యుండినట్లు గ్రహించిరి.

ఆ ప్రదేశమును ఒక చోళరాజు పరిపాలించుచుండెడివాడు. బ్రహ్మదేవుడు ధేను రూపమును, రుద్రుడు వత్సరూపమును పొంది, లక్ష్మీదేవి గోపాలిక రూపమును ధరించి ఆ ఆవుదూడలను రాజుకు విక్రయించి తిరిగి తన స్థలమునకు పోయెను. ఆ రాజు వద్ద నున్న ఆవులయందు ఈ రెండును కూడా చేరెను. గోపాలుడాయావును తక్కిన ఆవులతో పాటు మేతకై వేంకటాచలమునకు దోలుకుని పోవుచుండెను. ఆవు చక్కగా తేజస్సుతో నుండినదై మిక్కిలి పాలిచ్చు చుండెను. మహారాణి ఇందులకు ఎంతో సంతసించెడిది. ఆ యావు సాక్షాత్తూ సృష్టికర్త అయిన బ్రహ్మయే గదామరి!

ఇటుల కొంత కాలము గడిచిన పిదప బ్రహ్మరుద్రులు తామీ రూపములు ధరించిన కార్యము నాచరింప దలిచిరి. ఆ యావు మునుపు ఇచ్చునటుల పాలిచ్చుట మానివేసినది. దూడను పాలులేక బక్కచిక్కి పోయెను. ఇందులకు కారణము తెలిసిరాక గోపాలుడు మిక్కిలి మధనపడుచుండెను. ఒకనాడు ఎలాగైనను ఈ సంగతి గ్రహించవలెనని తలచి కనిపెట్టుకుని అత్యంత జాగరూకుడై యుండగా ఒక అద్భుత దృశ్యమును గనెను. గోవు ఒక పుట్ట రంధ్రమున తన పొదుగు నుండి పాలు పుట్టలోనికి స్రవింపచేయుట చూచి, గోపాలుడు మిక్కిలి కోపిష్ఠుడై తన చేతి గొడ్డలితో ఒక్క ఉదుటున యావును చంప యత్నించెను. పుట్టలో ఉన్న శ్రీనివాసుడు తటాలున పైకిలేచి ఆ గోవును రక్షింప అడ్డమురాగా, గోపాలుని కుఠారము వలన శ్రీనివాసుని శిరమునకు గాయమయ్యెను. గోపాలుడు రక్త ప్రవాహము గాంచి నిశ్చేష్టుడై ప్రాణములు విడిచెను.

జరిగినది తెలుసుకుని చోళరాజు ఆ పుట్ట కడకు వచ్చెను. అంతట శ్రీనివాసుడు ఈ పాప ఫలమునకు చోళరాజును పిశాచము గమ్మని శపించెను. అందులకు చోళరాజు మిక్కిలి విచారించగా ఆ యువకుని సాక్షాత్తూ శ్రీమన్నారాయణునిగా నెరిగి శాప నివృత్తి కోరెను. శాప నివృత్తి తెలిసికొనిన వాడై కొంతకాలమునకు తిరిగి నిజరూపము గలిగిన వాడయ్యెను.

అటు తరువాత శ్రీనివాసుడు దేవ గురువైన బృహస్పతిని పిలిపించి తన గాయమునకు మూలికా చికిత్స గావించుకొనెను. ద్వాపర యుగములోని యశోద వకుళమాతగా జన్మించి ఆ వనముల సమీపముననే నివసించు చుండెను. జన్మాంతర

మందలి వకుళమ్మ శ్రీనివాసుని గురించి తెలుసుకుని శ్రీ కృష్ణునిగానే భావించి తన ఆశ్రమమునకు ఆహ్వానించి నిత్యము సపర్యలు చేయుచుండెను.

చోళరాజైన ఆకాశరాజు, ధరణీదేవి దంపతులకు సంతానము లేకుండెను. ఎన్నో వ్రతముల నాచరించినను, ఎన్నో ఆలయముల దర్శించి అందున్న దేవతల సేవించిననూ ఫలము లేకుండెను. అంతట నారాజు తన యొద్దనున్న వేద శాస్త్రవేత్తలు, జ్యోతిష్కులు, పురోహితుల ప్రార్థించి వారి ఆనతిపై యాగ మొనర్ప నిశ్చయించెను. ఒక శుభ లగ్నమున యాగ పురోహితుల వేద మంత్రములు ఉచ్చరించుచుండగా, యాగ స్థలమును దున్నుటకు ఉపక్రమించెను. అంతట ఒక ప్రదేశమున తవ్వుతుండగా, చంద్రబింబము వలె ప్రకాశించుచున్న ఒక బాలికను గనుకొని మిక్కిలి ఆశ్చర్యపరుడయ్యెను. ఆమెను గృహమునకు తీసుకుని పోయి పద్మావతి అని నామకరణమొనర్చి అల్లారు ముద్దుగా పెంచుచుండెను. కొంత కాలమునకు యాగ ఫలితముగా ధరణీదేవి గర్భముదాల్చి ఒకా నొక శుభ ముహూర్తమున మిక్కిలి తేజోవంతుడైన పుత్రునికనెను. వసునాయకుడని అతనికి తల్లిదండ్రులు నామకరణ మొనర్చిరి. పద్మావతియు, వసునాయకుడును సోదర సోదరీమణీ వాత్సల్యముతో ఆడుచుండెడివారు.

పద్మావతి సాక్షాత్తూ మహాలక్ష్మియని అంతఃపురమున అందరూ అనుచుండెడివారు. పద్మావతి అత్యంత సౌందర్యురాలై శోభిల్లెడిది. తన చెలికత్తెలతో ఆడుచూ, పాడుచూ తల్లితండ్రులకు మిక్కిలి మురిపెము గలిగించు చుండెడిది. ఒకనాడు పద్మావతీ దేవి చెలులతో వన విహారమునకేగగా అచ్చట నారదుల వారు వృద్ధ తాపసి రూపమున దర్శనమిచ్చి అమ్మా నీవు జగన్మాతవైన మహాలక్ష్మివి. త్వరలోనే నీకు మహావిష్ణువుతో వివాహము కాగలదని శెలవిచ్చి అంతర్ధానమయ్యెను.

ఒకనాడు శ్రీనివాసుడు వేటలో క్రీడించుచు వేంకటాచలమందలి వనముల విహరించుచూ, ఒక గజమును వేటాడి వేటాడి అది యెంతకూ లభ్యముకాక పోవుచుండెడిచే కడు సమయము ఆ వనమందు పరుగిడుచుండెను. ఆ గజమును కన్పించినట్లే కన్పించి మాయమగు చుండెను. ఒక ప్రదేశమున అద్భుతయవ్వన రాశి యగు పద్మావతిని సఖీ పరివారముతో కూడ చూసి మోహించెను. పద్మావతి దరిచేరి

తనను పరిచయము చేసుకుని గాంధర్వ వివాహమాడదలిచెనని తన మనసులోని కోరిక తెలిపెను. సఖులందరూ ఈతడేమో పిచ్చి వానిలా యున్నాడే నని తలచిరి. లేకపోయినచో సాక్షాత్తూ రాకుమారియైన పద్మావతీ దేవిని వివాహమాడుదునని చెప్పుటయా! అని శ్రీనివాసుని ఒకింత కసురుకుని అచ్చటనుండి పద్మావతిని అంతఃపురమునకు తోడ్కొనిపోయిరి. శ్రీనివాసుడు తిరిగి ఆశ్రమమునకేగి వకుళ మాతకు జగిరిన వృత్తాంతము విన్నవించి తన మనోరథమును తెలిపెను. త్రేతాయుగము నాటి వేదవతియే ఈ పద్మావతి అని తెలిపెను.

అంతట కొంతకాలమునకు వకుళాదేవి యొక్క యత్నముల గ్రహించిన శుక మహాముని యొక్క ప్రయత్నఫలితముల తోడ పద్మావతి, శ్రీనివాసుల వివాహము నిశ్చయమయ్యెను. నారాయణపుర రాజు యొక్క అంతఃపురమున మంగళవాద్యములు మిక్కిలి మధురముగా మ్రోగుచుండెను. పుణ్యాంగనలు పద్మావతికి లక్ష్మీకల్యాణ గౌరీ కల్యాణ శుభ కీర్తనలు పాడుచు మంగళ స్నానము చేయించి, పట్టు చీర రవిక ధరింపచేసి కురులు చిక్కుదీసి జడవేసి అనేక అలంకారముల తోడ సింగారించిరి. పెద్ద ముత్తయిదువలు నుదుట కుంకుమబెట్టిరి. జగన్మాత అయిన శ్రీ మహాలక్ష్మీ దేవి వివాహము ఎంత అద్భుతము! ఎంత నయనానందకరము! ప్రతి ఘట్టము కనులకింపై జన్మతరింప జేయును.

ఆహా! సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడు, శ్రీ మహాలక్ష్మీదేవిల కల్యాణ విశేషములు తెలుసుకుని కనులారా గాంచుట ఎంతటి అదృష్టమో గదా!

పద్మావతి చేత వివాహమునకు వచ్చిన పెద్ద ముతైయిదువల బంధువర్గమును, వేద పండితుల, పురోహితుల భార్యలును, శ్రీమన్నారాయణునకు షోడషోపచారంబుల బూజించి పద్మావతి చేత మ్రొక్కించిరి. తల్లిదండ్రుల, పురోహిత బంధుజనులును, బ్రహ్మాది దేవతలును, బృహస్పతి ముఖ్యులయిన వారెల్లరును పద్మావతిని దీర్ఘ సుమంగళియై ప్రజలను కన్న ప్రజలుగా భావించి పోషించుగాక! యని దీవించిరి.

అలంకార శోభితురాలగు ఆ జగన్మాత పెళ్ళి కూతురుగా లోకమునకే తేజస్సు దెచ్చినది.

అన్నమాచార్యుల మాటలలోనే చెప్పాలంటే

పిడికిట తలంబ్రాల పెండ్లికూఁతురు కొంత
పెడమరలి నవ్వీనె పెండ్లి కూఁతురు
పేరుకల జవరాలె పెండ్లి కూఁతురు పెద్ద
పేరుల ముత్యాలజడ పెండ్లి కూఁతురు
పేరంటాడ్ల నడిమి పెండ్లి కూఁతురు విభు
బేరుకుచ్చ సిగ్గుబడీ బెండ్లి కూఁతురు

ఆ సాయంకాలము శ్రీ వేంకటాచలపతి బంధుమిత్ర సపరివార సమేతుడై నారాయణపురము రాగా ఆకాశరాజు పురోహిత పరివారములతో, మంగళ వాద్యములతో కొత్త పెండ్లి కొడుకైన శ్రీనివాసునికి నూతన వస్త్రాభరణములు, పూల మాలలు, చందనాది పరిమళ ద్రవ్యములు, పండ్లు, పానకములు తోడ ఎదురేగెను. శ్రీనివాసుడు మామగారైన ఆకాశరాజును చూసి గరుత్మంతుని దిగి ఎదురేగెను. ఆకాశరాజు అంతట ‘శ్రీమన్నారాయణా! శ్రీనివాసా! నిన్ను అల్లునిగా చేసుకున్న నా జన్మ కృతార్థమైనదయ్యా. ఎన్ని జన్మల పుణ్య ఫలమోగదా నిది! ధన్యుడనైతిని!’ అని శ్రీనివాసుని నూతన వస్త్రాభరణముల తోడ పూజించి పానకమిచ్చెను. శ్రీనివాసుని విడిది మందిరమునకు సాదరముగా తోడ్కొని బోవగా బంధుమిత్రులు, వేద బ్రాహ్మణులు, బ్రహ్మాది దేవతలు తోడువచ్చిరి. మంగళ వాద్యములు సుమధురముగా మ్రోగుచుండగా శ్రీనివాసుడు కుడికాలు ముందుగా పెట్టి విడిది మందిరము ప్రవేశించెను.

అంతకుముందు తొండమానుని భార్య పెండ్లి కొడుకైన శ్రీనివాసునికి మంగళహారతి పట్టెను. శ్రీనివాసుని యొక్క బంధు మిత్ర పరివారమంతయు ఆ విడిది మందిరమున చూసి మిక్కిలి సంతుష్టులై ఇష్టాగోష్టి గావించుచుండిరి. అంతట ఆకాశరాజు ఆహ్వానముచే దేవతలు, మహర్షులు, విప్రోత్తములు భోజనము గావించిరి.

ఆ దినము వైశాఖ శుద్ధ దశమి. పద్మావతీ శ్రీనివాసుల వివాహ ముహూర్త సమయము సమీపించుచున్నది. ఆకాశరాజు వర పూజకు కావలసిన వస్తు

సముదాయములన్నియు సిద్ధము చేసుకుని నూతన వస్త్రాభరణములు, పూల హారములు, తాంబూలములతోను, బృహస్పతి, శుక మహర్షులను ముందిడుకొని, సమస్త బంధుజన పరివారముతోడ శ్రీనివాసుని విడిది మందిరము కేగెను. అచ్చట బ్రహ్మాది దేవతలు, వసిష్ఠాది మహర్షులుతో పరివేష్టుడై ఇష్టాగోష్టి జరుపుతున్న పెండ్లి కొడుకైన శ్రీనివాసుని గాంచెను. వసిష్ఠుల వారు ఆకాశరాజుతో వరపూజ గావించవలసిందిగా చెప్పిరి. సాక్షాత్తూ శ్రీ మన్నారాయణునే పెండ్లి కుమారునిగా గాంచిన బ్రహ్మాది దేవతలు వసిష్ఠాది మహర్షులు తమ జన్మధన్యమయినదని శ్రీనివాసుని పరిపరి విధముల స్తుతించిరి. బ్రహ్మాది దేవతలును, ఇంద్రాది అష్ట దిక్పాలకులును, నారద, తుంబుర ఆదిగాగల గంధర్వ కింపురుష ప్రముఖులును, కళ్యాణ కూటమున నుచితాసనులయి ఉండిరి. మహర్షులందరును వశిష్ఠ బృ హస్పతుల తోడ కల్యాణ వేదిక దగ్గర నుపవిష్టులై యుండిరి. వశిష్టుల వారు మంత్రములు చదువుతుండగా ఆకాశరాజు శ్రీనివాసుని పాదముల కడిగి చందన కుంకుమ పుష్పాక్షతలతో పాద పద్మములను పూజించి కర్పూర హారతిబట్టి సాలంకృత కన్యాదాన ముహూర్తమునకు సంసిద్ధముగా నుండెను.

సుమంగళీమణులు పెండ్లి కుమార్తె అయిన పద్మావతీ దేవికి బంగారు కుచ్చులతో మల్లె మొగ్గల జడవేసి, పాపట బొట్టు, ముత్యాల చెంపసరములతో నలంకరించిరి. బంగారు సరిగంచు పట్టుచీరను గట్టి, అట్టిదే యగు రవిక తొడిగించి, తేజో మయమైన ఆభరణములను ధరింపజేసి కాటుక బుగ్గ చుక్క పెట్టిరి. కాళ్ళకు పారాణి రాసి శ్రీ మహాలక్ష్మిని నవ వధూ అలంకరణములతో బెండ్లికుమార్తెను సిద్ధము చేసిరి!

ఆహా ! శ్రీమహాలక్ష్మిని పెండ్లి కుమార్తెగాను, శ్రీమన్నారాయణుని పెండ్లి కుమారునిగాను అలంకరించిన వారి జన్మ ధన్యము. మన కనులముందే ఈ వివాహము జరుగుతున్నట్లు శరీరము పులకించుచున్నదే. ఆహా ! ఏమి మన జీవిత భాగ్యము!

కన్యాదాన మునకుపక్రమించుటకు ముందుగా మామగారైన ఆకాశరాజు అల్లుడైన శ్రీనివాసునికి కోటి సంఖ్యల సువర్ణనిష్కములను వరదక్షిణగా నిచ్చెను.

నవరత్న కర్ణ భూషణములను, భుజ కీర్తులను, వజ్రాది దివ్యమణి యుక్తమయిన అనేక ఆభరణములు ఘనముగా అల్లుడైన శ్రీ మన్నారాయణునికి బహుమానముగా నిచ్చెను.

అంతట ఆకాశరాజు వశిష్ట బృహస్పతుల వారు మంత్రములు చదువుతుండగా పద్మావతిని శ్రీనివాసునికి కన్యాదానము చేసెను. అంతట వశిష్టుల వారు శ్రీనివాసునికి కంకణధారణ గావించి శ్రీనివాసునిచే పద్మావతికి కంకణధారణ చేయించెను. ఆ సమయమున బృహస్పతుల వారు కన్యా ప్రవరనిట్లు చెప్పిరి. శ్రీనివాసా ! శ్రీ వేంకటేశా! అత్రిగోత్రోద్భవురాలు, సువీర మహారాజు ప్రపౌత్రి, సుధర్మ మహారాజు పౌత్రియు, ఆకాశరాజు పుత్రియునగు సౌభాగ్యవతి పద్మావతిని నీకు సహధర్మచారిణిగా అర్థాంగిగా మంత్ర పూర్వకముగా ఆకాశరాజు నీకు కన్యాదానమిచ్చెను. అంగీకరింపుము అనెను. ఈ విధముగా బృహస్పతుల వారు కన్యాప్రవర చెబుతుండగా ఆకాశరాజు శ్రీనివాసునికి అనేక రత్నా భరణముల నొసగెను.

ఇక శ్రీనివాసుని గురించి ప్రవర చెప్పవలెను గదా. ఈ భాగ్యము వశిష్టుల వారికి కలిగెను. వశిష్టుల వారు శ్రీనివాసుని గురించి ప్రవర చెప్పుచు భారద్వాజ గోత్రోద్భవుడు, యయాతి ప్రపౌత్రుడు, శూరుని పౌత్రుడు, వసుదేవుని పుత్రుండగు శ్రీ వేంకటేశ్వరులు అత్రి గోత్రోద్భవురాలగు ఆకాశరాజు పుత్రిని తన సహధర్మచారిణిగా స్వీకరించుచున్నాడని చెప్పెను. మంగళవాద్యముల మధురఘోషల మధ్య ధరణీదేవి చేతి తీర్థమును ఆకాశరాజు తన చేతపట్టి శ్రీనివాసుని కుడి హస్తమందుంచి కన్యాదానము చేసెను.

వశిష్ఠాది పురోహితులు మాంగల్యధారణ మంత్రములు ఉచ్ఛరించు చుండగా, సుమంగళీమణులు, దివ్య కళ్యాణ కీర్తనలు గావించుచుండగా శ్రీనివాసుడు పద్మావతి కంఠమున మంగళ సూత్రమును గట్టెను. ముల్లోకములు సంతసించినవి.

దేవ దుంధుభులు మోగెను. దేవతలు, మహర్షులు, నవ వధూవరులపై నవరత్నాక్షతలను చల్లుచు ఆశీర్వదించిరి. అంతటి మహాభాగ్యమునకు అందరి తనువులుప్పొంగి బోయెను. వశిష్టుల వారు వధూవరుల చేత హోమము వేద మంత్రముల తోడ గావించెను. ఆకాశరాజు వివాహమునకు విచ్చేసిన వారందరికినీ

పుష్ప, ఫల, చందన, తాంబూలములను దక్షిణతో నిప్పించెను. ముహూర్తమునకు ముందు భుజింపని వారందరికినీ పుష్ప, ఫల, చందన, తాంబూలములను దక్షిణతో నిప్పించెను. ముహూర్తమునకు ముందు భుజింపని వారందరికీ ఆకాశరాజు భోజన ఏర్పాట్లు గావించెను.

ఆనందమానంద మాయెనే

పరమానంద మానందమాయెనే

శ్రీపద్మావతి శ్రీనివాసుల

కళ్యాణ వీక్షణ మదృష్ట

భాగ్యమెంతెంతని జెప్పుదురే

పరమానంద మానందమాయెనే

వివాహమహోత్సవము కన్నుల పండువగా అయిదు రోజులు జరిగినది. సమస్త విశ్వమునకు ఆ అయిదు రోజులు కళ్యాణ శోభయే. అయిదవ రోజు సాయంకాలము ధరణీదేవి, ఆకాశరాజు తమ కుమార్తె పద్మావతిని కౌగలించుకుని ఇన్ని వత్సరములుగా పెంచిన ప్రేమ, కన్నప్రేమ కంటెను పెరిగిపోయి, ఆదరణ పెల్లుబికిరాగా శ్రీనివాసునికి, వకుళాదేవికిని అప్పగింతల పాటలమధ్య పద్మావతిని చీర, సారెతోడ అప్పగించిరి.

ఆకాశరాజు ఆనందమునకు హద్దులు లేక పోయెను. సాక్షాత్తూ శ్రీమన్నారాయణునితో అనుబంధమూ, బంధుత్వమూ చేకూరడం జన్మాంతర సుకృతమేనని భక్తి పారవశ్యుడై, ఆనంద హర్షాతిరేకుడై శ్రీనివాసుని కౌగిలించుకుని హృదయమునకు హత్తుకున్నాడు.

శ్రీమన్నారాయణా! జగన్నాథా! జగద్రక్షకా! నిన్ను అల్లునిగా చేసుకున్న ఏమి నా భాగ్యము ! ఎంతటి భాగ్యమిచ్చితివయ్యా! అని ఆకాశరాజు శ్రీనివాసుని పరిపరి విధముల స్తుతించెను. ఆనందముతో ఉబ్బితబ్బిబ్బుడాయెను.

సాక్షాత్తూ జగత్ప్రభువైన శ్రీ మహావిష్ణువునే అల్లునిగా బొందు మహాభాగ్యము ఎందరకు కలుగగలదు ! ఇది అంతయు ఆకాశరాజు పూర్వజన్మ సుకృతమే!

శ్రీనివాసుడు చిరునవ్వుతో అందరివద్దా సెలవు తీసుకుని పద్మావతీ సమేతముగా రథమునెక్కి బ్రహ్మాది దేవతలు, మహర్షులవారు, వెంటరాగా సువర్ణముఖి తీరమున నున్న అగస్త్యాశ్రమమునకు చేరెను. అగస్త్యుల వారు పరమానందముతో ఎదురువచ్చి సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే శ్రీ మహాలక్ష్మి సమేతుడై నవ వధూవరులుగా తన ఆశ్రమమునకు వచ్చుట ఎంతటి భాగ్యమోనని ఆనందముతో ఉప్పొంగిపోయెను. శ్రీనివాసుడు, పద్మావతియునూ వివాహము అయిన ఆరు మాసముల వరకు కొండ నెక్కకూడదన్న నియమము చేత అగస్త్యుల వారి ఆతిథ్యము స్వీకరించదలిచిరి. ఇది విన్న అగస్త్యుల వారు పరమానంద భరితులై ఓ పరంధామా! నాకింతకు మించిన భాగ్యమేమున్నది. మీకై ఇచ్చటనే చక్కటి ప్రదేశములో ఏకాంతత గల కడు రమణీయమైన పూల తోటల మధ్య పర్ణశాలను నిర్మించెదనని సెలవిచ్చి అట్లే ఏర్పాటు చేసెను.

నూతన వధూవరులు పద్మావతీ, శ్రీనివాసులు ఇద్దరునూ ఒక శుభ ముహూర్తములో వశిష్ఠ బృహస్పతి, అగస్త్య మహర్షులవారు స్వస్తి పుణ్యాహ వచనములు పలుకుతుండగా గృహ ప్రవేశము గావించిరి. శ్రీనివాసుడు, పద్మావతి ఆ విధముగా ఆరు మాసములు నివసించిన ప్రదేశమే నేటి 'శ్రీనివాస మంగాపురం'. కల్యాణ వేంకటేశ్వరుని దివ్యాలయముగల పవిత్ర ప్రదేశము.

ఆరు మాసములు గడిచిన పిదప శ్రీనివాసుడు వేంకటాచలమునకు బోవ తలచెను.

ఆకాశరాజు, ధరణీదేవిలకు ఈ వర్తమానము పంపగా వారు కుమార్తెకు సారె, చీర రవిక లిచ్చి, వివిధ రకములైన కాయ ధాన్యములు, చింతపండు, చక్కెర, పాల బిందెలు మున్నగు అనేకముగు వస్తు సామాగ్రి తోడు అత్త వారింటికి సాగనంపెను. అంతట శ్రీనివాసుడు పద్మావతి తోడ కొండనెక్కతలచి ప్రియసఖీ పద్మావతి! వేంకటాద్రిపైన కరివేపాకు లభ్యము కానేరదు. కావున అదియును మరువక తీసుకుని పోవలెనని చెప్పగా పద్మావతి అట్లే చేసెను.

నూతన దంపతులైన శ్రీనివాసుడు, పద్మావతులను వేంకటాద్రిపైన వకుళాదేవి సాదరముతోడ ఆహ్వానించినది. కొంతకాలమునకు శ్రీనివాసుడు తొండమానుని

పిలిచి తనకు ఆలయము నిర్మించమనగా అట్లే యొనరించిన పిదప శ్రీమన్నారాయణుడు వక్షస్థల మహాలక్ష్మితోడ శుభముహూర్తమున ఆనంద నిలయము ప్రవేశించెను.

శ్రియఃకాంతాయ కల్యాణ నిధయే నిధయేఽర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.